పాఠం
18

# స్వతంత్ర భారతదేశం
## (మొదటి ముప్పై సంవత్సరాలు - 1947-1977)

**1950, జనవరి 26న మనం వైరుధ్యాలతో కూడిన జీవనంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయాల్లో సమానత్వం ఉంటుంది, కానీ సామాజిక, ఆర్థిక అంశాల్లో అసమానత్వం ఉంటుంది. రాజకీయాలలో ఒక వ్యక్తి – ఒక ఓటు, ఒక ఓటు – ఒకే విలువ అన్న సూత్రాన్ని గుర్తించబోతున్నాం. అయితే సామాజిక, ఆర్థిక జీవితంలో మనకున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థ వల్ల ఒక వ్యక్తి– ఒక విలువ అన్న సూత్రాన్ని తిరస్కరిస్తూనే ఉంటాం. వైరుధ్యాలతో కూడిన ఈ జీవితాన్ని ఎంతకాలం భరిస్తూ వద్దాం? ఎంతకాలం మన సామాజిక, ఆర్థిక జీవితాలలో సమానత్వాన్ని సాధించకుండా ఉందాం? ఇలా ఎక్కువ కాలం కొనసాగనిస్తే మన రాజకీయ ప్రజాస్వామ్యమే ముప్పునకు లోనవుతుంది. ఈ వైరుధ్యాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి, లేకపోతే అసమానత్వంతో పీడింపబడుతున్న వాళ్లు ఈ రాజ్యాంగ సభ కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక వ్యవస్థను కుప్పకూలుస్తారు.**

– బి.ఆర్. అంబేద్కర్

ఇంతకు ముందు అధ్యాయంలో భారత రాజ్యాంగాన్ని ఎలా రూపొందించారో చూశాం. ఏక కాలంలో అనేక లక్ష్యాలను సాధించటానికి రాజ్యాంగం కృషి చేసింది: ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పటం, దేశాన్ని ఐక్యం చేసి ఒకే రాజకీయ విధానాన్ని రూపొందించటం, పెద్ద ఎత్తున సామాజిక, ఆర్థిక మార్పులను తీసుకురావటం. రెండు శతాబ్దాలపాటు విదేశీ శక్తులతో పాలింపబడిన ప్రజలకు తక్కువ కాలంలో జాతి లక్ష్యాలను రూపొందించి, వాటిని సాధించటానికి వ్యవస్థాగత విధానాలను ఏర్పరచటం చిన్న విషయం ఏమీకాదు.

భారతదేశ స్వాతంత్ర్య అనంతర చరిత్రలో తొలి సంవత్సరాలు నిర్ణయాత్మక పాత్రను పోషించాయనటంలో సందేహం లేదు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం, సామాజిక, ఆర్థిక మార్పులను తీసుకురావడం, ప్రజాస్వామిక వ్యవస్థ పనిచేసేలా చూడటం అన్నవి దేశ నాయకత్వం ముందున్న ప్రధాన సవాళ్లు. ఈ సమస్యలలో ఒకదానికొకటి సంబంధం ఉండి, సమతౌల్యం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవలసి వచ్చింది. ఉదాహరణకు ప్రజాస్వామ్యాన్ని పణంగా పెట్టి అభివృద్ధి లక్ష్యాలను, దేశ ఐక్యత, సమగ్రతలను సాధించటానికి లేదు. ఈ అధ్యాయంలో ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న ఈ మూడు అంశాలతో పాటు రాజ్యాంగమూ, ప్రజాస్వామ్యమూ ఎలా పనిచేశాయో, జాతి నిర్మాణంలో కీలకమైన అంశాలను భారతదేశం ఎలా ఎదురుకొందో చూద్దాం.

- సామాజిక సమానత్వాన్ని సాధించామని మీరు అనుకుంటున్నారా? సామాజిక సమానత్వాన్ని, అసమానత్వాన్ని సూచించే మీకు ఎదురైన ఉదాహరణలను పేర్కొనండి.

## మొదటి సార్వత్రిక ఎన్నికలు

కొత్త రాజ్యాంగం కింద నిర్వహించబోయే మొదటి సార్వత్రిక ఎన్నికలు భారతీయ ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమైనవి. బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్రం వచ్చిన తరువాత ప్రజాస్వామిక పంథాని అనుసరించటానికి భారతదేశం కట్టుబడి ఉండటాన్ని ఇవి సూచిస్తాయి. పాశ్చాత్య దేశాలలోలాగా ముందుగా ఆస్తి ఉన్న వాళ్లకి, తరువాత ఇతర సామాజిక వర్గాలకు ఓటు హక్కును దశల వారీగా విస్తరింపచెయ్యకుండా భారతదేశంలో వయోజనులందరికీ ఒకేసారి ఓటు హక్కు కల్పించారు. ఉదాహరణకు స్విట్జర్‌లాండ్‌లో మహిళలకు ఓటు హక్కు 1971లో గానీ లభించలేదు.



చిత్రం 18.1 : ముందుగా ఓటు వెయ్యటం

సామాజిక కోణాల కారణంగా కూడా మొదటి ఎన్నికలు కష్టమయ్యాయి. జనాభాలో అధిక భాగానికి చదవటం, రాయటం రాదు. వాళ్లు తమ ఎంపికను ఎలా తెలియచేస్తారు? దేశంలోని కొన్ని ప్రాంతాలలో మహిళలు వాళ్ల తండ్రి, లేదా భర్త ద్వారా గుర్తింపబడేవారు, వాళ్లకి వేరే ప్రత్యేక గుర్తింపు ఉండేది కాదు. మహిళలకు సమాన హక్కులు ఉండి దేశాన్ని మరింత సామాజిక సమానత్వంవైపు తీసుకెళ్లటానికి ఇది మారాల్సి ఉంది. ఓటర్ల జాబితా ఎలా తయారుచెయ్యాలి? దేశ వ్యాప్తంగా ఎన్నికలను నిర్వహించే బాధ్యతను చేపట్టటానికి ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు.

నిరక్షరాస్యతా సమస్యను అధిగమించటానికి ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలు, అభ్యర్థులను సూచించేలా రోజువారీ జీవితంనుంచి కొన్ని గుర్తులను ఉపయోగించటం అన్న వినూత్న ఆలోచనతో ముందుకు వచ్చింది. ఈ సృజనాత్మక, వినూత్న ప్రయోగం కారణంగా సుదీర్ఘ వివరణల అవసరం లేకుండా బొమ్మను గుర్తిస్తే సరిపోయింది. ఇదే విధానం ఇప్పటికీ కొనసాగుతోంది. దీనిని మరింత సులభతరం చేయడానికి మొదటి ఎన్నికలలో ప్రతి అభ్యర్థికి బయట వైపు వాళ్ల గుర్తు అంటించిన వేరువేరు బ్యాలెట్ పెట్టెలు కేటాయించారు. తాను ఎంచుకున్న అభ్యర్థి బ్యాలెట్ పెట్టెలో ఓటరు తన ఓటును వేస్తే సరిపోతుంది. ఎన్నికలకు సిద్ధమవుతున్న క్రమంలో ఓటు వేసేలా ప్రజలను ప్రోత్సహించటానికి పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

- ఎన్నికలను, ప్రత్యేకించి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవటాన్ని నిరక్షరాస్యత ఎలా ప్రభావితం చేసుంది? ఈ సమస్యను ఎలా పరిష్కరించవచ్చు?
- ప్రజలందరికీ ఓటు హక్కు లేకపోతే మనది ప్రజాస్వామిక దేశమని చెప్పుకోటానికి వీలు ఉండేదా?
- మహిళలలో అక్షరాస్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వాళ్లకు ఓటు హక్కు కల్పించకుండా ఉంటే అది మన విధానాలను ఎలా ప్రభావితం చేసి ఉండేది?
- క్రమం తప్పకుండా ఎన్నికలను నిర్వహించటం అన్నది ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పామనటానికి స్పష్టమైన సంకేతం. ఈ వ్యాఖ్యానంతో మీరు ఏకీభవిస్తారా? కారణాలను పేర్కొనండి.

### ఎన్నికల వివరాలు

పరదా వ్యవస్థని ఖచ్చితంగా పాటించే జిల్లాలలో సాధారణంగా కేవలం మహిళా అధికారులతో ప్రత్యేక మహిళా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అజ్మేర్‌లో ఒక రాజ్‌పుత్ మహిళ పూర్తిగా కప్పిన రథంలో పోలింగ్ కేంద్రానికి వచ్చింది. ఆమె శరీరమంతా వెల్వెట్ వస్త్రంలో చుట్టి ఉంది. మళ్లీ ఓటు వెయ్యకుండా చెరిగిపోని సిరా చుక్క వేయించుకోవడానికి చాచిన ఎడమ చూపుడువేలు తప్ప, ఆమె శరీరంలోని మరో భాగాన్ని కనిపించనీయలేదు.

కొన్ని గ్రామాలు మొత్తంగా కలిపి ఓటు వేశాయి. అసోం నుంచి వచ్చిన నివేదిక ప్రకారం ఒక గిరిజన గ్రామ ప్రజలు ఓటింగ్ జరగటానికి ఒక రోజు ముందే ప్రయాణం చేసి అక్కడికి చేరుకున్నారు. ఆ రాత్రి అంతా వాళ్లు పెద్ద మంటల చుట్టూతా పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ గడిపారు. సూర్యోదయం అయ్యేవరకు ఇలా గడిపారు. ఆ తరువాత పోలింగ్ కేంద్రాలకు ఒక వరసలో క్రమశిక్షణతో కవాతు చేస్తూ వెళ్లారు.

పెప్సు గ్రామ ప్రజలు ఎవరికి ఓటెయ్యాలో నిర్ణయించుకునే సమస్యకు పరిష్కారంగా ఆ అభ్యర్థుల యువ ప్రతినిధులకు కుస్తీ పోటీ పెట్టి అందులో గెలిచిన అభ్యర్థికి ఓటు వేస్తామన్న అంగీకారానికి వచ్చారు.

పోలింగ్ కేంద్రాలలో సమర్పించటానికి ఎన్నో వస్తువులను తీసుకువచ్చారు. బ్యాలెట్ పెట్టెలను తెరిచినప్పుడు తమ విశ్వాసాన్ని ప్రకటించే ఉత్తరాలు, ఒక్కొక్కసారి ఆహారం, బట్టలు ఇవ్వమని వేడుకునే విన్నపాలు కనిపించేవి.

(1958లో మార్గరెట్ డబ్ల్యు. ఫిషర్, జోన్ వి. బొండ్యురాంట్ రాసిన "ప్రజాస్వామిక ఎన్నికలలో భారతీయ అనుభవం" పుస్తకంలో నుంచి తీసుకున్న అంశాలు, ప్రచురణకర్త: ఇండియన్ ప్రెస్ డైజెస్ట్స్.)


## రాజకీయ వ్యవస్థలో ఏకపార్టీ ఆధిపత్యం

స్వతంత్ర భారతదేశంలో 1952, 1957, 1962లలో జరిగిన మొదటి మూడు సార్వత్రిక ఎన్నికలలో ఇతర అభ్యర్థులను నామమాత్ర స్థానాలకు పరిమితం చేస్తూ భారత జాతీయ కాంగ్రెస్ అఖండ విజయాలు సాధించింది. భారతదేశానికి జవహర్‌లాల్ నెహ్రూ మొదటి ప్రధానమంత్రి అయ్యాడు. ఇతర పార్టీలలో ఏ ఒక్కదానికి 11 శాతానికి మించి ఓట్లు రాలేదు. మొత్తం పోలయిన ఓట్లలో 45%తో కాంగ్రెస్ 70 శాతానికి పైగా స్థానాలను గెలుచుకుంది. ఇతర ఏ పార్టీ కూడా కాంగ్రెస్‌కి సమీపంలో లేదు.

కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాలలో కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో కొంతమంది పరిశీలకులు పేర్కొంటున్న కాంగ్రెస్ వ్యవస్థ ఏర్పడింది. దాదాపుగా అన్ని సందర్భాలలో పాలకపార్టీగా ఉన్న కాంగ్రెస్‌కి, ఇతర పార్టీలకు మధ్య ఉన్న సంబంధాల ప్రత్యేక స్వభావాన్ని బట్టి ఈ కాలాన్ని గుర్తిస్తారు. అయితే, కాంగ్రెస్‌లో ఎల్లప్పుడూ అంతర్గతంగా చిన్న చిన్న బృందాలు (Groups) ఉండేవి. ఈ బృందాలు నాయకుల మధ్య పోటీ కారణంగా ఏర్పడ్డాయి. పార్టీ లక్ష్యాలతో వీళ్లు ఏకీభవించినప్పటికీ కొన్ని విధానాల విషయంలో విభేదాలు ఉండేవి.

సభ్యుల ప్రయోజనాలను బట్టి ఈ బృందాలు వివిధ అంశాలపై వేరువేరుగా స్పందించేవి. దీని వల్ల కాంగ్రెస్ పార్టీ విభిన్న దృక్పథాలు, ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లుగా కనిపించేది. కొన్ని సందర్భాలలో ఈ బృందాలు ఇతర రాజకీయ పార్టీలతో కలిసి నాయకత్వం మీద ఒత్తిడి తీసుకురావటానికి

*గ్రాఫ్ 1 : 1952, 1962 ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీలు గెలుచుకున్న స్థానాలు*




*రాజకీయ పార్టీల సూచిక (అయిదు కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నవి మాత్రమే)*

| 1952 | 1962 |
|---|---|
| భారత జాతీయ కాంగ్రెస్ | భారత జాతీయ కాంగ్రెస్ |
| స్వతంత్రులు | భారత కమ్యూనిస్టు పార్టీ |
| భారత కమ్యూనిస్టు పార్టీ | స్వతంత్రులు |
| సోషలిస్టు పార్టీ | స్వతంత్ర పార్టీ |
| కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ | జనసంఘ్ |
| పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ | ప్రజా సోషలిస్టు పార్టీ |
| గణతంత్ర పరిషత్ | ద్రవిడ మున్నేట్ర కజగం |
| ఇతరులు | సోషలిస్టు పార్టీ |
| | ఇతరులు |

ప్రయత్నించేవి. ఇది పాలనాపక్షంలోపల తన విధానాలను సవరించుకునేందుకు కూడా దోహదం చేసేది. ఏకపార్టీ ఆధిపత్యంలో ఉన్న పరిస్థితిలో కూడా కాంగ్రెస్ పార్టీలోపలే రాజకీయ పోటీ ఉంటూ ఉండేది. కాబట్టి ప్రతిపక్ష పార్టీలు నిజమైన ప్రమాదాన్ని కాక అవ్యక్త ప్రమాదాన్ని మాత్రమే సూచించేవి.

కాబట్టి ఈ పరిస్థితి ఇతర రాజకీయ పార్టీలు లేని అప్రజాస్వామిక పరిస్థితి కాదు. ఇతర పార్టీలు పోటీ చేశాయి కానీ, కాంగ్రెస్‌ని సవాలుచేయగలిగే సంఖ్యలో స్థానాలను గెలుచుకోలేక పోయాయి. ఇతర రాజకీయ పార్టీలు క్రమేపీ బలం పుంజుకుని రెండు దశాబ్దాల కాలంలో అధికారానికి పోటీదారుగా ఎదిగాయి. ఈ కాలం ప్రధానంగా తొలి సంవత్సరాలలో ప్రజాస్వామ్యాన్ని సంరక్షించి స్వేచ్ఛాయుత, బహిరంగ పోటీపై ఆధారపడిన బహుళ పార్టీ వ్యవస్థ ఏర్పడటానికి దోహదం చేసింది.


రాజ్యాంగ చట్రం బలం కారణంగా, స్వాతంత్ర ఉద్యమం వేసిన ప్రజాస్వామిక పునాదుల కారణంగా భారతదేశ రాజకీయాలు బహుళపార్టీ ప్రజాస్వామ్యంగా ఎదగగలిగాయి. అధికారంలో ఉన్న పార్టీలు తరచు పక్షపాతంతో వ్యవహరించి, బహుళపార్టీ ప్రజాస్వామ్యం వేళ్లనుకోకుండా ప్రతిపక్షాలను అణిచి వేసేవి. అదే సమయంలో స్వాతంత్రం పొందిన ఇండోనేసియా, పాకిస్తాన్, చైనా, నైజీరియా వంటి వలసపాలిత దేశాల అనుభవం కంటే భారతదేశ అనుభవం ఎంతో భిన్నంగా ఉంది.

- రాజకీయ వ్యవస్థలో కాంగ్రెసు ఆధిపత్యానికి దోహదం చేసిన కారణాలను క్లుప్తంగా వివరించండి.

## రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ

కొత్తగా ఏర్పడిన దేశం ఎదుర్కొన్న మొదటి సవాళ్లలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను పునఃవ్యవస్థీకరించాలన్న కోరిక ఒకటి. బ్రిటిష్ కాలంలో దేశం ప్రెసిడెన్సీలు (కలకత్తా, మద్రాస్, బాంబే)


గానూ, సెంట్రల్ ప్రావిన్సెస్, బీదర్ వంటి అనేక పెద్ద రాష్ట్రాలుగానూ విభజించి ఉండేది. దేశంలో అధిక భాగం అనేక సంస్థానాల కింద ఉంది. ఈ రాష్ట్రాలలో పలు భాషలు మాట్లాడే ప్రజలు కలిసి జీవిస్తున్నారు. ఉదాహరణకు మద్రాసు ప్రెసిడెన్సీలో తమిళం, మళయాళం, కన్నడ, తెలుగు, గోండి, ఒడియా భాషలు మాట్లాడేవాళ్లు ఉండేవాళ్లు. ఒకే భాషను మాట్లాడుతూ పక్కపక్క ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలంతా ఒక రాష్ట్రంగా సంఘటితపరచాలంటూ కోరసాగారు. వీటిల్లో సంయుక్త కర్నాటక (మద్రాసు, మైసూరు, బాంబే, హైదరాబాదులలో కన్నడ మాట్లాడే ప్రజలను కలుపుతూ), సంయుక్త మహారాష్ట్ర, మహాగుజరాత్ ఉద్యమం, ట్రావెన్‌కూర్–కొచ్చిన్ సంస్థానాల విలీనం, సిక్కులకు పంజాబ్ రాష్ట్రంవంటి కోరికలు ఉండేవి. ఈ కోరికలను అంగీకరించటంవల్ల దేశ ఐక్యతను పెంచటానికి దోహదం చేస్తుందా, లేక భాషా ప్రాతిపదికన దేశంలో విభజనను తెస్తుందా అన్నది ప్రధాన అంశంగా మారింది.



చిత్రం 18.2 : 1950ల ఆరంభంలో రోడ్డుకి పునాది వేస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ

మత ఆధారంగా దేశ విభజన జరగటంతో నాయకుల మనసులో భారతదేశ భద్రత, సుస్థిరత పట్ల అనుమానాలు, భయాలు కలగసాగాయి. భాషా ప్రాతిపదిక రాష్ట్రాలను పునఃవ్యవస్థీకరిస్తే దేశం ముక్కలుగా కావటానికి దారితీస్తుందని భయపడసాగారు. కాంగ్రెస్ పార్టీ భాషా ప్రాతిపదికపై సంఘటితమై ఉన్నప్పటికీ, ఆ ఆధారంగా దేశాన్ని పునఃసంఘటితం చేస్తామని మాట ఇచ్చినప్పటికీ స్వాతంత్రం వచ్చిన తరువాత అందుకు వెంటనే పూనుకోలేదు.

తెలుగు మాట్లాడే ప్రజలు అన్నిటికంటే తీవ్ర ఉద్యమాన్ని చేపట్టారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాలకు అనుగుణంగా కాంగ్రెస్ చేసిన తీర్మానాన్ని అమలు చెయ్యాలని వాళ్లు పట్టుపట్టారు. బ్రిటిష్ పాలనలో కూడా ఆంధ్ర మహాసభ క్రియాశీలంగా ఉండి మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు మాట్లాడే ప్రజలను ఒక్క తాటి కిందకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేసింది. ఈ ఉద్యమం స్వాతంత్రం తరువాత కూడా కొనసాగింది. విన్నపాలు, దరఖాస్తులు, వీధులలో కవాతులు, నిరాహారదీక్షలు వంటి పద్ధతులను ఇందుకు ఉపయోగించారు. ఈ కోరికను కాంగ్రెస్ వ్యతిరేకించటం వల్ల తెలుగు మాట్లాడే ప్రాంతాల్లో మొదటి ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ స్థానాలను గెలుచుకోలేదు. భాషా ప్రాతిపదిక ఉద్యమాన్ని బలపరిచిన పార్టీలు ఎక్కువ స్థానాలను గెలుచుకున్నాయి.




పటం 1 : రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణకు ముందు ద్వీపకల్ప దక్షిణ ప్రాంతంలో వివిధ ప్రాంతాలను చూపించే పటం.

భాషా ప్రాతిపదిక రాష్ట్రాలకు జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకం కాదు; అయితే ఇది అందుకు తగిన సమయం కాదని భావించాడు. ఆనాటి నాయకులలో ఈ విషయంలో ఇదే ఏకాభిప్రాయం ఉండేది. భారతదేశం తన స్థానాన్ని పదిలపరుచుకునే ప్రక్రియలో ఉందని, ఈ సమయంలో ఎటువంటి దృష్టి మళ్లింపులు ఉండకూడదని వాళ్లు భావించారు.

## రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ చట్టం, 1956

ప్రత్యేక తెలుగు రాష్ట్రం కోరుతూ నిరాహారదీక్ష చేస్తున్న పొట్టి శ్రీరాములు 58 రోజుల నిరాహార దీక్ష తరువాత 1952 అక్టోబరులో చనిపోయాడు. దాంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలను ఏర్పరిచారు. 1953 ఆగస్టులో రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ సంఘాన్ని (ఎస్ ఆర్ సి) వేశారు. దీంట్లో ఫజల్ ఆలి, కె.ఎం. పణిక్కర్, హృదయనాథ్ కుంజ్రులు సభ్యులుగా ఉన్నారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించవలసిందిగా ఈ సంఘాన్ని కోరారు. ఈ సంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగా 1956లో పార్లమెంటు రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ చట్టాన్ని ఆమోదించింది. దీని ఆధారంగా 14 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి. భాషా ప్రాతిపదిక రాష్ట్రాలను ఏర్పాటు చేస్తున్నప్పుడు గోండి, సంథాలి, లేదా ఒరావన్ వంటి గిరిజన భాషలను పరిగణనలోకి తీసుకోలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి; ఆధిపత్య, లేదా శక్తిమంత ప్రజానీకం మాట్లాడే తమిళం, తెలుగు వంటి భాషలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు.

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటం ప్రజల అభీష్టం ఎలా నెగ్గిందో, ఒక సమస్యను రాజకీయాలు ఎలా పరిష్కరించాయో తెలియచేస్తుంది. ఇప్పుడు ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ నాయకులు భయపడినట్లుగా దేశాన్ని బలహీన పరచలేదు, అది భారతదేశం బలపడటానికే దోహద పడింది.


- భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడి ఉండకపోతే దేశ ఐక్యతకు మరింత మేలు జరిగి ఉండేదా?
- ఆ సమయంలో గిరిజన భాషలను ఎందుకు పట్టించుకోలేదు?
- భారతదేశంలో ప్రస్తుతం ఎన్ని రాష్ట్రాలు, ఎన్ని కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి?
- భారతదేశంలో ఇటీవల ఏర్పడిన కొత్త రాష్ట్రాలు ఏవి, అవి ఎప్పుడు ఏర్పడ్డాయి?

## సామాజిక, ఆర్థిక మార్పు

రాజ్యాంగ సభ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, హోదా, అవకాశాలలో సమానత్వాన్ని కోరుకుంది. ఆధునిక భారతదేశ నిర్మాణంలో సామాజిక, ఆర్థిక మార్పుకి అది ప్రముఖ స్థానాన్ని ఇచ్చింది. కొత్త రాజ్యాంగాన్ని ఆవిష్కరించిన నెల రోజులకు ప్రణాళికా సంఘాన్ని ఏర్పరిచారు. ప్రణాళికా రచనను నెహ్రూ మంచి ఆర్థిక విధానమే కాకుండా మంచి రాజకీయాలుగా కూడా భావించాడు. ప్రణాళికాబద్ధ అభివృద్ధి ద్వారా కులం, మతం, ప్రాంతం వంటి విభజన ధోరణులు తగ్గి భారతదేశం బలమైన, ఆధునిక దేశంగా ఎదుగుతుందని అతడు ఆశించాడు.

మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యవసాయం మీద కేంద్రీకరించి ఆహార ఉత్పత్తిని పెంచటానికి, రవాణా, ప్రసారాల రంగాల మెరుగుదలకి, సామాజిక సేవల కల్పనకు ప్రాధాన్యతను ఇచ్చింది. భారతదేశం సాధ్యమైనంత త్వరగా పారిశ్రామికీకరణ చెందటానికి కూడా అది శ్రద్ధ వహించింది. ఆహారం మౌలిక

*చిత్రం 18.3 : 1960లో నిర్మాణంలో ఉన్న భాక్రా ఆనకట్ట, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశం నిర్మించిన మొదటి ఆనకట్టలలో ఇది ఒకటి. (కింద) తొలి దశాబ్దాల నాటి వయోజన విద్యాతరగతులకు సంబంధించిన ఫొటో. ఈ పథకాలతో సమాజంలో అభివృద్ధి లేదా మార్పులకు సంబంధించిన భావాలు ఎలా వ్యక్తం అవుతున్నాయో చర్చించండి.*





అవసరం కావటంతో ఆహార ఉత్పత్తిని పెంచాలన్న దానిమీద ఏకాభిప్రాయం ఏర్పడింది, కానీ దీనిని ఎలా సాధించాలన్న దానిమీద ఏకాభిప్రాయం కుదరలేదు. రాజకీయ అభిప్రాయం రెండు ప్రశ్నలపై విడిపోయింది. విస్తృత అభివృద్ధి విధానంలో వ్యవసాయానికి ఇవ్వవలసిన స్థానం ఏమిటి? వ్యవసాయానికీ, పరిశ్రమలకీ మధ్య వనరుల కేటాయింపు ఎలా ఉండాలి?

వ్యవసాయ రంగంలోని మార్పును నెహ్రూ కేవలం ఆర్థిక అంశంగా చూడలేదు, దానిని గ్రామీణ రంగ రాజకీయ, సామాజిక, ఆర్థిక మార్పుగా పరిగణించాడు. నెహ్రూ మొగ్గుచూపిన విధానాన్ని చివరికి అనుసరించారు. ఇందులో మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి: భూ సంస్కరణలు, వ్యవసాయ సహకార సంఘాలు, స్థానిక స్వపరిపాలన. మూడు రకాల భూ సంస్కరణలను ప్రతిపాదించారు: జమీందారీ వ్యవస్థ రద్దు, కౌలు విధానాల సంస్కరణ, భూ పరిమితి విధానాలు. వీటన్నిటి ప్రధాన ఉద్దేశం దున్నేవానికి భూమి చెందేలా చూసి మరింత ఉత్పత్తి చెయ్యటానికి ప్రోత్సహించటం. సహకార సంఘాల ద్వారా ఆర్థికంగా లాభసాటి పరిమాణాన్ని చేరుకోవటమే కాకుండా విత్తనాలు, ఎరువులు, రసాయనాలు వంటి విలువైన ఉత్పాదకాలను అందించాలి. స్థానిక ప్రభుత్వాలు భూ సంస్కరణలు అమలు అయ్యేలా చూసి, గ్రామ ఉమ్మడి ప్రయోజనాలకు అనుగుణంగా సహకార సంఘాలు నడిచేలా చూస్తాయి.

అయితే భారతదేశమంతటా భూ సంస్కరణలను మనఃస్ఫూర్తిగా అమలు చేయలేదు. జమీందారీ వ్యవస్థను రద్దు చేశారు కానీ, భూమి లేనివాళ్లకి భూ పంపిణీ జరగలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ధనికులు, శక్తిమంతులు భూమిలోని అధిక భాగాలపై నియంత్రణ కొనసాగిస్తూనే ఉన్నారు. దళితులు ఇంకా భూమి హీనులుగానే ఉన్నారు, కానీ వెట్టిచాకిరి నిర్మూలన, అంటరానితనం నిషేధం వల్ల ప్రయోజనం పొందారు.

మొదటి పంచవర్ష ప్రణాళికలో పెద్ద ఆనకట్టలు కట్టి విద్యుత్తు ఉత్పత్తి, సాగునీటి కల్పనల ద్వారా వ్యవసాయాన్ని వృద్ధి చేయటంపై దృష్టి సారించారు. ఆనకట్టల వల్ల వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు

రెండూ లబ్ధి పొందాయి. వ్యవసాయ ఉత్పత్తి పెరిగినప్పటికీ అది జనాభా అవసరాలకు సరిపోయేటంతగా లేదు.

దేశం ప్రగతి సాధించాలంటే పరిశ్రమలను అభివృద్ధి చేసి మరింత మంది కర్మాగారాలలోనూ, సేవారంగంలోనూ పనిచేసేలా మళ్లించాల్సిన అవసరం ఉందని ప్రణాళికా కర్తలు గుర్తించారు. దాంతో రెండవ పంచవర్ష ప్రణాళిక నుంచి ప్రాధాన్యత పరిశ్రమల వైపుకి మళ్లింది. భారతదేశ ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన ఈ అంశాలను ఇంతకు ముందు తరగతులలో మీరు చదివి ఉంటారు.

## విదేశీ విధానం, యుద్ధాలు

భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన సమయంలోనే ప్రచ్ఛన్న యుద్ధం మొదలయ్యి ప్రపంచమంతా రష్యా కూటమి (USSR) లేదా అమెరికా కూటమి (USA)గా విడిపోతోంది. జవహర్‌లాల్ నెహ్రూ ఏ శిబిరంలోనూ చేరకుండా రెండింటికీ సమ దూరంలో ఉంటూ విదేశీ విధానంలో స్వతంత్రంగా వ్యవహరించసాగాడు. అదే సమయంలో స్వాతంత్ర్యం పొంది అదే విధానాన్ని కొనసాగించాలనుకుంటున్న ఇండోనేసియా, ఈజిప్టు, యుగొస్లేవియా వంటి దేశాలతో అతడు చేతులు కలిపాడు. వీళ్లంతా కలిసి అలీనోద్యమాన్ని నిర్మించారు. పొరుగుదేశాలకు సంబంధించి ఒకరి అంతరంగ వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదన్న పంచశీల సూత్రాలను నెహ్రూ రూపొందించాడు. అయితే ఈ కాలంలో భారతదేశం రెండు యుద్ధాలను ఎదుర్కోవలసి వచ్చింది. మొదటిది 1948లో కాశ్మీరు విషయంపై పాకిస్తాన్‌తోనూ, రెండవది 1962లో చైనాతోనూ జరిగాయి. భారతదేశం ఈ యుద్ధాలకు, ప్రత్యేకించి 1962 యుద్ధానికి సన్నద్ధమైలేనందున పెద్ద ఎత్తున ప్రాణ నష్టాన్ని, ధన నష్టాన్ని చవి చూడవలసి వచ్చింది.

- మీరు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నట్లయితే 1970లకి ముందు సహకార సంఘాల వంటి సంస్థలను స్థాపించారేమో తెలుసుకోండి, దాంట్లో సభ్యులుగా ఎవరు ఉన్నారో తెలుసుకోండి.
- భారతదేశంలో చేపట్టిన భూ సంస్కరణలను చైనాలోనూ, వియత్నాంలోనూ చేపట్టిన వాటితో పోల్చండి.

## నెహ్రూ తరువాత

1964లో నెహ్రూ చనిపోయిన తరువాత ప్రజాస్వామ్యం మనగలుగుతుందా, లేక ఇతర దేశాలలో లాగానే ప్రజాస్వామిక సూత్రం దెబ్బతింటుందా అన్న అనుమానాలు విమర్శకులకు కలిగాయి. అయితే ప్రభుత్వాధినేతగా లాల్ బహదూర్ శాస్త్రిని ఎంపిక చేయటంతో కాంగ్రెస్, మార్పును విజయవంతంగా చేపట్టగలిగింది. భారతదేశ లక్ష్యాలు, మౌలిక విలువలకు సవాలుగా నిలిచిన అనేక అంశాలతో శాస్త్రి వెంటనే తలపడాల్సి వచ్చింది. దక్షిణాదిన డిఎంకె చేపట్టిన హిందీవ్యతిరేక ఉద్యమం దేశ ఐక్యత, సమగ్రతకే ముప్పుగా నిలిచింది, ఆహార కొరత సామాజిక, ఆర్థిక ప్రగతికి ఆటంకంగా మారింది, అంతేకాకుండా 1965లో పాకిస్తాన్‌తో యుద్ధం మొదలయ్యింది. 1966లో శాస్త్రి అకాల మరణంతో ఆ తరువాత ప్రధాన మంత్రిగా ఇందిరాగాంధి ఎంపిక అయ్యింది.



*చిత్రం 18.4 : లాల్ బహదూర్ శాస్త్రి*

## హిందీ వ్యతిరేక ఉద్యమం

1963లో అధికార భాషా చట్టాన్ని ఆమోదించినప్పుడు హిందీని మిగిలిన దేశంమీద రుద్దడానికి ఎత్తుగడగా భావించి, డిఎంకె తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా హిందీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా సమ్మెలు, ధర్నాలు, హర్తాళ్‌లు నిర్వహించారు. దిష్టిబొమ్మలు, హిందీ పుస్తకాలు, చివరికి రాజ్యాంగంలోని పేజీలను కూడా తగలబెట్టారు. సైన్ బోర్డులలో హిందీలో ఉన్న దానిమీద చాలాచోట్ల నలుపు రంగు పూశారు. పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం ఈ అల్లర్లను పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీయే హిందీ అనుకూల, హిందీ వ్యతిరేక శిబిరాలుగా విడిపోయింది. దేశ ఐక్యతకే ముప్పు ఏర్పడిందని కొందరు భావించారు.

చివరికి పరిస్థితులు చేజారిపోతున్నట్లు అనిపించడంతో అప్పటి ప్రధాని శాస్త్రి హిందీ అనుకూల వాదనని సమర్థించినప్పటికీ, హిందీ వ్యతిరేక శిబిరంలోని ఉద్వేగాలను శాంతపరచటానికి అనేక మినహాయింపులను ప్రకటించాడు. వీటిల్లో కొన్ని: ప్రతి రాష్ట్రానికి తన సొంత భాష కలిగి ఉండే హక్కు ఉంది, అది ప్రాంతీయ భాష కావచ్చు లేక ఇంగ్లీషు కావచ్చు, పత్ర వ్యవహారాలు ఇంగ్లీషు అనువాదంతో ప్రాంతీయ భాషలలో ఉండవచ్చు, కేంద్రం-రాష్ట్రాల మధ్య వ్యవహార భాషగా ఇంగ్లీషు కొనసాగుతుంది, సివిల్ సర్వీసు పరీక్షలు కేవలం హిందీలోనే కాకుండా ఇంగ్లీషులో కూడా నిర్వహిస్తారు.

ఇక్కడ కూడా ఒక జనాదరణ పొందిన సామాజిక ఉద్యమం వల్ల ప్రభుత్వం తన అధికారిక స్థానాన్ని పునః సమీక్షించుకోవలసి వచ్చింది. ఆందోళనకారులతో ఏకీభవించకపోయినప్పటికీ ఈ రెండు సందర్భాలలో ప్రధాన మంత్రులిద్దరూ పరిస్థితులు చేజారిపోకుండా చూడటానికి తమ దృక్పథాన్ని మార్చుకున్నారు. తమ దృక్పథం కంటే దేశ ఐక్యత ముఖ్యమని నెహ్రూ, శాస్త్రి స్పష్టంగా గుర్తించారు.

- భాషా విధానం జాతి ఐక్యత, సమగ్రతలకు ఎలా దోహద పడింది?
- జాతీయ భాష అవసరం ఉందా?
- అన్ని భాషలకు సమాన హోదా ఉండాలా?

## హరిత విప్లవం

అభివృద్ధి వ్యూహానికి సంబంధించిన చర్చ కేవలం ఆర్థిక పరమైనదేకాదు, దీనికి రాజకీయ కోణాలు కూడా ఉన్నాయి. నెహ్రూ, కాంగ్రెస్‌లో వామపక్షం వైపు మొగ్గుచూపే బృందం వ్యవసాయంలో ప్రభుత్వ నియంత్రిత వ్యవస్థాగత విధానాన్ని ఎంచుకున్నారు. అయితే కాంగ్రెస్‌లోనే మితవాదంవైపు మొగ్గ చూపే బృందం ప్రభుత్వ నియంత్రణను వ్యతిరేకించింది. వీళ్లు ఆ కార్యక్రమాలను నిరంతరం విమర్శిస్తూ, ఆ ప్రతిపాదనలను నీరుకార్చసాగారు. ఈ బృందం రాష్ట్ర స్థాయిలో బలంగా ఉన్నందువల్ల ప్రణాళికలు సరిగా అమలుకాకుండా అడ్డుకుంది.

ముందు ఎంచుకున్న విధానం ఆహార ఉత్పత్తి పెరుగుదలకు దోహదం చేయడంలేదని గుర్తించిన తరువాత 1964-67 మధ్య భిన్నమైన వ్యూహాన్ని ఎంచుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆహార ఉత్పత్తి పెంచటానికి ప్రయత్నించారు. ఒక రకంగా నెహ్రూ చనిపోయిన తరువాత ఆర్థిక ఆలోచనలు, ఆర్థిక విధానాలలో మార్పును కూడా ఇది సూచిస్తుంది.

## ప్రాంతీయ పార్టీలు, ప్రాంతీయ ఉద్యమాల ప్రాబల్యం

భారతదేశ చరిత్రలో 1967 ఎన్నికలు చాలా కీలకమైనవి. ఎన్నికలను ప్రజలు చాలా ముఖ్యంగా పరిగణిస్తున్నారని, వాటికి తమదైన ఉనికి ఉందని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. ఈపాటికి ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాల వల్ల లాభపడిన వాళ్లు, నష్టపడినవాళ్లు కూడా ఉండటంతో రాజకీయ పోటీ తీరులో కూడా మార్పు వచ్చింది. కాంగ్రెస్ పార్టీ అంతకు ముందెన్నడూ చవిచూడని ఫలితాలను చవిచూసింది. స్వాతంత్ర్యం తరువాత అది అంత తక్కువ ఆధిక్యతతో (284 స్థానాలు) ఎప్పుడూ ఎన్నిక కాలేదు. బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, మద్రాస్, కేరళ శాసన సభలలో కాంగ్రెస్ ఓటమి పాలయ్యింది. దాదాపు 20 ఏళ్లపాటు నిరాటంకంగా పాలించిన పార్టీ ఇప్పుడు సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే ఓడిపోయిన పార్టీ అధికారాన్ని పట్టుకుని వేలాడలేదు, ఎన్నికలలో గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యనిచ్చింది. దేశంలో ప్రజాస్వామ్యం వేళ్లూనుకుందని ఇది సూచిస్తుంది, పోటీతో కూడిన బహుళపార్టీ వ్యవస్థ వైపుకి దేశం పయనిస్తోంది.

కాంగ్రెస్ ఘోర పరాజయంపాలైన రాష్ట్రాలలో తమిళనాడు, కేరళ ఉన్నాయి. తమిళనాడులో డిఎంకె ఘన విజయం సాధించింది. సంఘటితంగా నిర్వహించే ప్రాంతీయ ఉద్యమాలు ఆధిపత్య పార్టీకి సవాలుగా ఉండగలవని ఇది తెలియచేసింది. డిఎంకెకి సినిమా రంగంతో బలమైన సంబంధాలు ఉన్నాయి. ప్రజాదరణ ఉన్న సినిమా హీరో యం.జి. రామచంద్రన్, అతడిని అందరూ యంజిఆర్ అంటారు, అభిమాన సంఘాలను తనకు మద్దతుగా డిఎంకె ఉపయోగించుకోగలిగింది.

పక్కన ఉన్న కేరళలోనే కాకుండా పశ్చిమ బెంగాల్, ఒడిశాలో కూడా కాంగ్రెస్ ఓడిపోయింది. ఈ ఓటములు, సవాళ్లతో కాంగ్రెస్ అంతరంగికంగా కూడా బలహీనపడింది. ఉత్తరాది రాష్ట్రాలలో స్వల్ప విజయాలుపొందిన చోట్ల దాని ప్రతినిధులు ప్రతిపక్షాలకు ఫిరాయించారు. ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు పడిపోయి సంయుక్త విధాయక దళ్ (ఎస్‌విడి) ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఇది ప్రధానంగా కాంగ్రెస్‌కు వ్యతిరేకమైన శాసనసభ్యులు – జనసంఘ్, సోషలిస్టులు, స్వతంత్ర పార్టీ, కాంగ్రెస్ ఫిరాయింపుదారులు, స్థానిక పార్టీల శాసనసభ్యులు ఏర్పరిచిన సంకీర్ణం.

భారత రాజకీయ చరిత్రలో ఈ కొత్త ప్రభుత్వాలు ఒక మైలురాయిగా ఉంటాయి. ఒక విధంగా ప్రజాస్వామిక తిరుగుబాటును ఇది సూచిస్తుంది. మధ్యస్థాయి కులాలు – ఇవి భూ సంస్కరణల వల్ల ప్రయోజనం పొంది ఆర్థికంగా లాభపడ్డాయి – మొదటిసారిగా రాజకీయ అధికారాన్ని పొందాయి. ఈ కులాలు – హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో జాట్, బీహార్‌లో కుర్మి, కొయిరి, మధ్యప్రదేశ్‌లో లోథ్, ఈ అన్ని రాష్ట్రాలలో యాదవ్, ఆంధ్రప్రదేశ్‌లో రెడ్డి, కమ్మ, కర్నాటకలో ఒక్కళిగా, తమిళనాడులో వెల్లల. ఈ కులాలు ఆయా రాష్ట్రాలలో ఆధిపత్యకులాలుగా ఉండి జనాభా రీత్యాకూడా అధిక సంఖ్యలో ఉన్నాయి. ఇతర ఆధిపత్య (వెనకబడ్డ) కులాలు అధికారంలోకి రావటానికి డిఎంకె పార్టీయే మంచి ఉదాహరణ.

ఈ ఎస్‌విడి ప్రభుత్వాలలో చాలావరకు ఎక్కువకాలం పాటు నిలవలేదు. వాటిచరిత్ర అవినీతి, ఫిరాయింపులతో నిండిపోయింది. అధికార కాంక్ష ఒక్కటే వాళ్లను కలిపినట్టు ఉంది. ఈ ప్రభుత్వాలు సాధించింది ఏమీ లేదు. అయితే ఈనాటికి కూడా ప్రాంతీయ లేదా రాష్ట్రస్థాయి పార్టీలను వీటిని ప్రామాణికంగా చేసుకునే అంచనా వేస్తున్నారు.

ఈ కాలంలో దేశంలో వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ భావాలు తిరిగి ఊపందుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణ కోరసాగారు. ఈ ఉద్యమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు నాయకత్వం వహించారు. అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని కొన్ని వర్గాలకే చెందుతున్నాయన్నది వీళ్ల ప్రధాన ఆరోపణ.



చిత్రం 18.5 : ఇందిరా గాంధి

1969 డిసెంబరులో అసోంలోని ఖాసి, జైంతియా, గారో గిరిజన ప్రాంతాలతో మేఘాలయ అన్న కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. 1966లో ఏర్పడిన పంజాబ్‌కి తనదంటూ రాజధాని లేదు. హర్యానా, పంజాబ్‌లకు ఉమ్మడి రాజధానిగా ఉన్న ఛండీఘర్‌ని తమకు ఇవ్వమని 1968-69లో పంజాబ్ ప్రజలు ఆందోళనలు చేశారు. మహారాష్ట్రలో బొంబాయి మహారాష్ట్రవాసులకే చెందాలన్న వింత వాదన మొదలయ్యింది. దీనికి శివసేన నాయకత్వం వహించింది. నగరంలోని ఉద్యోగాలన్నింటినీ దక్షిణాది రాష్ట్రాల వాళ్లు చేజిక్కించుకుంటున్నారన్న భావనతో ఈ పార్టీ ఆ రాష్ట్రాల ప్రజలను లక్ష్యంగా చేసుకుంది.

అదే సమయంలో పాత డిమాండ్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాశ్మీరు, నాగాలాండ్ డిమాండ్లు ఈ కాలంలో చోటు చేసుకున్నాయి. గృహ నిర్బంధం నుంచి విడుదలైన తరువాత షేక్ అబ్దుల్లా కాశ్మీరు రాష్ట్రానికి తిరిగి వచ్చాడు. అదేవిధంగా నాగాలాండ్‌లో కొత్త, యువ నాయకత్వం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లటానికి సన్నద్ధమయ్యింది.

ఈ కాలంలోనే మత ఉద్రేకాలు కూడా చోటు చేసుకున్నాయి. దేశంలోని పలు ప్రాంతాల్లో మతకల్లోలాలు చెలరేగాయి: రాంచి (బీహార్), అహ్మదాబాదు (గుజరాత్), జలగావ్ (మహారాష్ట్ర), అలీఘర్

### జమ్ము & కాశ్మీరు

*భారత సమాఖ్యలో ఇతర సంస్థానాల లాగా కాకుండా జమ్మూ & కాశ్మీరు చేరిన పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇతర పాలకుల లాగా కాకుండా రాజు అయిన హరిసింగ్ అటు పాకిస్తాన్‌లోనూ, ఇటు భారతదేశంలోనూ విలీనం కాకుండా జమ్మూ & కాశ్మీరుని స్వతంత్ర రాజ్యంగా ఉంచాలని కోరుకున్నాడు. ఈ రాష్ట్రంలో ముస్లిములు అధిక సంఖ్యలో ఉన్నారు, రాజు హిందువు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చినకాలంలో అక్కడ అఖిల జమ్ము & కాశ్మీరు కాన్ఫరెన్స్ పేరుతో ప్రజా ఉద్యమం ఒకటి నడుస్తోంది. దీనికి షేక్ మొహమ్మద్ అబ్దుల్లా నాయకత్వం వహిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగాలలో ముస్లిములకు అధిక ప్రాతినిధ్యం, ప్రాతినిధ్య ప్రభుత్వం వంటి కోరికలతో ఈ ఉద్యమం సాగుతోంది. ఈ ఉద్యమం, ఆ తరువాత నేషనల్ కాన్ఫరెన్స్‌గా పరిణమించింది, దీంట్లో సిక్కులు, హిందువులు కూడా సభ్యులుగా ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ కూడా కాంగ్రెస్ లాగానే మతసామరస్యానికి, సామ్యవాదానికి కట్టుబడి ఉంది.*

1947 చివరి నాటికి పశ్చిమ సరిహద్దులనుంచి పాకిస్తాన్ మద్దతుతో రజాకార్ల దాడులు మొదలయ్యాయి. ఈ దాడి చేస్తున్నవాళ్లు శ్రీనగర్‌ని సమీపిస్తుండటంతో రక్షణ కోసం మహారాజు భారతీయ సైన్యాన్ని సహాయం కోరాడు. అయితే జమ్ము & కాశ్మీరు భారతదేశంలో విలీనం అయిన తరువాత దాని సైన్యం అందుబాటులో ఉంటుందని భారత గవర్నర్ జనరల్ చెప్పారు.

ఆ సమయంలో రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి, అది స్వయంప్రతిపత్తితో కొనసాగటం గూర్చి విస్తృతమైన చర్చలు జరిగాయి.

1948లో భారతదేశం ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి ముందు ఉంచింది. అయితే విషయాన్ని సరిగ్గా వివరించలేక పోవటంవల్ల ఇది భారతదేశం – పాకిస్తాన్‌ల సమస్యగా మారింది. ఈలోగా, షేక్ అబ్దుల్లా ఢిల్లీ ఒప్పందంగా పిలవబడుతున్న దానికి అంగీకరించాడు. దీని ప్రకారం కాశ్మీరీలు భారతదేశ పూర్తి పౌరులుగా ఉంటారు, అదే సమయంలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఆ రాష్ట్రం అధిక స్వయం ప్రతిపత్తి, అధికారాలు కలిగి ఉంటుంది. రాష్ట్ర మౌలిక స్వభావాన్ని కాపాడటానికి ఉద్దేశించిన ఈ ఒప్పందంలోని అనేక అంశాలు రాజ్యాంగంలోని 370వ అధికరణంలో చోటు చేసుకున్నాయి.

అదే సమయంలో రాష్ట్రంలో ఉన్న ఆర్థిక తేడాలు మతపరమైన రంగు సంతరించుకున్నాయి. రాష్ట్రంలో భూ సంస్కరణల వల్ల భూ పరిమితికి మించి ఉన్న భూస్వాముల భూములను స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా భూమి కోల్పోయిన వాళ్లల్లో ఎక్కువమంది హిందూ భూస్వాములు కాగా, మిగులు భూమి పంపకంలో భూమిని పొందిన వాళ్లు ముస్లిములు. 1950–1990 మధ్యకాలంలో ఈ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని తగ్గించి మిగిలిన రాష్ట్రాలతో సమానంగా చెయ్యటానికి కేంద్ర ప్రభుత్వం అనేకసార్లు ప్రయత్నించింది. దీనికి కాశ్మీరు ప్రజలు తీవ్రంగా స్పందించారు. దీనిని ఆధారంగా చేసుకుని 1990లలో కాశ్మీరు స్వతంత్రం కావాలంటూ ఉద్యమం మొదలయ్యింది. ఈ కాలంలో కాశ్మీరు లోయ నుంచి అనేక హిందు కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస పోవలసి వచ్చింది.

(ఉత్తరప్రదేశ్). ఇవి కష్టకాలాలు. రాజకీయ మార్పు అప్పుడే జరిగి కొత్త నాయకత్వం రూపుదిద్దుకుంటోంది. పెరుగుతున్న రాజకీయ చైతన్యం, కోర్కెలను వెల్లడించగలగటం కారణంగా ఏర్పడుతున్న ఒత్తిడిలను తట్టుకోటానికి కొత్త నాయకత్వం ఇంకా తగినంత సన్నద్ధంగా లేదు.

1967 ఎన్నికల తరువాత వామపక్ష పంథావైపు తీవ్ర మొగ్గు చూపడంద్వారా బయటినుంచి, పార్టీలోపలనుంచి వస్తున్న సవాళ్లను ఇందిరాగాంధి ఎదుర్కొంది. పేదలు, అట్టడుగు ప్రజలతో తాను, తమ పార్టీ మమేకం కావటంద్వారా పార్టీకి కొత్త సామాజిక మద్దతును కూడగట్టటానికి ఆమె ప్రయత్నించింది. ఇది రెండు వైపులా పదును ఉన్న ఆయుధం. సామాజిక, ఆర్థిక ప్రగతికి సంబంధించిన వాగ్దానాలు ఇంకా నెరవేరలేదు. 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవటానికి ఇదొక ప్రధాన కారణం. అయినా ఇందిరాగాంధి మరిన్ని కొత్త వాగ్దానాలు చేసింది. ఒక దశాబ్ద కాలంలో పెరుగుతున్న ప్రజల కోరికలు తీరక నిరాశ, నిస్పృహలు ఏర్పడి అత్యవసర పరిస్థితి విధించటానికి దారితీసింది.

## బంగ్లాదేశ్ యుద్ధం

1970 దశాబ్దం ప్రథమాంకంలో తూర్పు పాకిస్తాన్ (ఇప్పటి బంగ్లాదేశ్)లో ఆందోళనలు చోటు చేసుకున్నాయి. పశ్చిమ పాకిస్తాన్ తమపై సవతితల్లి ప్రేమ కనపరచటంపై నిరసనలు చెలరేగాయి, తమ బెంగాలీ అస్థిత్వాన్ని చాటుకోటానికి ఉద్యమాలు మొదలయ్యాయి. సార్వత్రిక ఎన్నికలలో ముజిబుర్ రెహ్మన్ నాయకత్వంలోని పార్టీ గెలుపొందింది. కానీ అతడిని అరెస్టు చేసి పశ్చిమ పాకిస్తాన్‌కి తీసుకెళ్లారు. తూర్పు పాకిస్తాన్‌లో సైనిక అణిచివేత కాలం మొదలయ్యింది. అక్కడ నుంచి తరలి వచ్చిన లక్షలాది కాందిశీకులకు భారతదేశం వసతి కల్పించి ఆహారాన్ని అందించాల్సి వచ్చింది. ఈలోగా బంగ్లాదేశ్

విముక్తి ఉద్యమం మొదలయ్యింది. దీంట్లో భారతదేశ సహాయాన్ని కోరారు. 1971లో భారతదేశం-పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం మొదలయ్యింది. భారతదేశం నిర్ణయాత్మకంగా జోక్యం చేసుకుని బంగ్లాదేశ్‌కు విముక్తి సాధించి, స్వతంత్ర దేశంగా ఏర్పడేలా సహాయపడింది. భారతదేశం తన సైనిక బలాన్ని పెంచుకోవటం వల్లనే కాకుండా అలీన దేశంగా తన స్థితిని నైపుణ్యంతో ఉపయోగించుకుని రెండు అగ్రరాజ్యాలు యుద్ధంలో జోక్యం చేసుకోకుండా చెయ్యటంవల్ల ఇది సాధ్యమయ్యింది.

## వామపక్ష పంథావైపు మలుపు

కొత్త విధానాలు, కొత్త కార్యక్రమాలను చేపట్టటం ద్వారా ఇందిరాగాంధి తనకూ, కాంగ్రెస్ పార్టీకి కొత్త దారి వేసింది. ఈ విధానం ద్వారా ఆమెకు పార్టీ నిర్మాణంపై పూర్తి పట్టు లభించింది.

యుద్ధంలో గెలిచిన వెంటనే "గరీబీ హటావో" అన్న జనాకర్షక నినాదంతో 1971 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ రికార్డు స్థాయిలో విజయం సాధించింది. దీనితో ఇందిరాగాంధీకి ప్రజాదరణ మరింత పెరిగింది. ప్రతిపక్షం అన్నది దాదాపు లేకుండా పోయింది. ఆమె విమర్శకుల నోళ్లు మూతపడ్డాయి, ఆమె ప్రజల ప్రియతమ నేత అయ్యింది. ఆ తరువాత 1972లో రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికలలో ఇందిరాగాంధి ప్రజాదరణను ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ మంచి ఫలితాలే పొందింది. ఇప్పుడు ఆమెకు పార్టీపైనా, పార్లమెంటుపైనా నియంత్రణ ఏర్పడింది. అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరాగాంధి అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ అంచెలంచెలుగా అధికార కేంద్రీకరణ గావించింది.

ఈ కాలంలో సామాజిక, ఆర్థిక మార్పు సాధించాలన్న లక్ష్యంతో అనేక ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేస్తూ చేసిన చట్టం, రాజ భరణాలను రద్దుచేస్తూ చేసిన చట్టం ముఖ్యమైనవి. ఈ రెండు చట్టాలను న్యాయస్థానాలలో సవాలు చేశారు. దాంతో రాజకీయ లక్ష్యాలలో న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటున్నాయనిపించేట్టుగా చేశారు.

అయితే, విధానాలు, కార్యక్రమాలకు సంబంధించి న్యాయవ్యవస్థకు భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. సామాజిక, ఆర్థిక మార్పు అన్న పేరుతో రాజ్యాంగాన్ని తరచు సవరిస్తున్నారని, అది వాస్తవానికి దాని స్వరూపాన్ని మార్చివేస్తోందని, భిన్న వ్యవస్థాగత నిర్మాణాల మధ్య ప్రస్తుతం ఉన్న సమతౌల్యం దెబ్బ తింటోందని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పును ఇచ్చింది. దీంతో రాజ్యాంగ సవరణకు ప్రభుత్వానికి ఉన్న అధికారాలకు కొంతవరకు పరిమితులు విధింపబడ్డాయి.

తన నియంత్రణలో లేని ఘటనల కారణంగా ఇందిరాగాంధి సమస్యలలో చిక్కుకుని తన మాటలు నిలుపుకోవటం కష్టం అయ్యింది. ఆమె ప్రభుత్వం తీవ్ర సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొంది. 1973లో అరబ్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధంతో చమురు ధరలు ఎన్నడూ లేనంతగా పెరగటంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రంగా పెరిగింది. ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఆహార కొరత, నిరుద్యోగం వంటివి ప్రభావం చూపసాగాయి. ప్రజలలో అధిక శాతం సంతోషంగా లేరు. దీంతో ప్రతిపక్షాలకు అవకాశం దొరికింది. దేశ వివిధ ప్రాంతాలలోని అసంతృప్తిని ఆసరా చేసుకోసాగారు. జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ఐక్యమైన ప్రతిపక్షాలు దేశంలోని పలు ప్రాంతాలలో కాంగ్రెస్‌కి, ప్రత్యేకించి ఇందిరాగాంధికి వ్యతిరేకంగా ఉద్యమించాయి. దీనిని జెపి ఉద్యమంగా పేర్కొంటారు. ఇది బీహారులోనూ, గుజరాత్‌లోనూ చాలా పెద్ద ఎత్తున జరిగింది.

## అత్యవసర పరిస్థితి

శాంతిని కాపాడే పేరుతో ఈ ఉద్యమానికి స్పందిస్తూ పౌరహక్కులకు భంగం కలిగేలా ప్రభుత్వం అనేక తీవ్రమైన చట్టాలను చేసింది. ప్రభుత్వాన్ని తనకు వ్యక్తిగతంగా ప్రధానమంత్రి మలుచుకుంటోందని కూడా ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈలోగా 1971 ఎన్నికలలో ప్రజా ప్రతినిధుల చట్టంలోని కొన్ని అంశాలను అతిక్రమించిందంటూ లోక్‌సభకు ఇందిరాగాంధి ఎన్నికను అలహాబాదు కోర్టు రద్దు చేసింది. అయితే ఆమె సుప్రీంకోర్టు నుంచి నిలుపుదల ఆదేశాలు తెచ్చుకుంది.

కొన్ని రోజుల తరువాత జెపి ఉద్యమం మరింత తీవ్రతరం కావటంతో ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, శాంతి, భద్రతలు నెలకొల్పటానికి దేశ సమగ్రతను కాపాడటానికి, సామాజిక, ఆర్థిక మార్పులను కొనసాగించటానికి అది అవసరమయ్యిందని ప్రభుత్వం దానిని సమర్థించుకుంది.



*చిత్రం 18.6 : కోల్‌కతాలో కుటుంబ నియంత్రణ ఆసుపత్రి*

దీనితో ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. దేశంలో శాంతి, భద్రతలకు అవసరమంటూ ప్రభుత్వం అనేక అణిచివేత చర్యలకు పాల్పడింది. అనేక ప్రాథమిక హక్కులను నిలిపి వేశారు. ఏ కారణం లేకుండా అరెస్టు చెయ్యటం, హింసించటం, పౌరహక్కులకు భంగం కలిగించటం వంటి అనేక ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ కాలంలో ధరల నియంత్రణ, నల్ల బజారు, వెట్టిచాకిరీలకు వ్యతిరేకంగా సాగే ఉద్యమాలను ప్రజలు స్వాగతించారు. అయితే ఇదే కాలంలో చేపట్టిన మురికివాడల తొలగింపు, జనాభా నియంత్రణ పేరుతో బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించటం వంటి కార్యక్రమాలు ప్రజల కోపానికి కారణమయ్యాయి. అయితే పౌరహక్కులు లేనందువల్ల ప్రజలు తమ అసంతృప్తిని వెల్లడిచేసే మార్గాలు లేకపోయాయి, దాంతో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ప్రభుత్వానికి లేకుండాపోయింది.

ఈ కాలంలో చెప్పుకోదగిన మరొక ముఖ్య పరిణామం రాజ్యాంగానికి చేసిన 42వ సవరణ. ఇది అనేక మార్పులను తీసుకు వచ్చింది. ఈ సవరణ ఉద్దేశాలు: అ) ఎన్నికల వివాదాలలో న్యాయస్థానాలకు చోటు లేకుండా చెయ్యటం; ఆ) రాష్ట్ర ప్రభుత్వాలతో పోలిస్తే కేంద్ర ప్రభుత్వాన్ని బలపరచటం; ఇ) సామాజిక, ఆర్థిక మార్పుకి ఉద్దేశించిన చట్టాలకు న్యాయస్థానాల నుంచి సాధ్యమైనంత రక్షణను కల్పించటం; ఈ) న్యాయ వ్యవస్థ పార్లమెంటుకు లోబడి ఉండేలా చేయటం. ఈ సవరణ ఉద్దేశాలుగా దేశ సమైక్యతను బలపరచటం, సామాజిక, ఆర్థిక అభివృద్ధిని న్యాయస్థానాల నుంచి కాపాడటం వంటి వాటిని పేర్కొన్నప్పటికీ వాస్తవంలో దీనివల్ల దేశ ప్రజాస్వామ్య స్వభావం బలహీనపడింది.

## ముగింపు

మొదటి ముప్పై సంవత్సరాలు అత్యవసర పరిస్థితితో ముగిసినప్పటికీ, లాభ నష్టాల పట్టిక తయారుచేస్తే తప్పులు కంటే ఒప్పులే ఎక్కువ ఉన్నాయి.

స్థిరమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పటం ఈ కాలంలో సాధించిన అత్యంత ముఖ్యమైన విషయంగా పేర్కొనవచ్చు. అదే సమయంలో స్వాతంత్రం పొందిన ఇతర దేశాలతో భారతదేశాన్ని పోలిస్తే భిన్న ప్రయోజనాలు కలిగిన పార్టీలతో పోటీతో కూడిన బహుళపార్టీ వ్యవస్థ క్రమేపీ రూపొందటం అన్నది నిజమైన విజయంగా పేర్కొనాలి. ఇతర దేశాలలో లాగా కాకుండా భారతదేశంలో క్రమం తప్పకుండా, భయంలేని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగటమే కాకుండా ప్రభుత్వాలు, నాయకులు కూడా మార్పుకి లోనయ్యారు. భారత రాజ్యాంగం పౌరహక్కులను ఇవ్వటమే కాకుండా వాటిని కాపాడటానికి వ్యవస్థాగత నిర్మాణం కూడా రూపొందించింది.

న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం, కంట్రోలర్ & ఆడిటర్ జనరల్ వంటి స్వతంత్ర వ్యవస్థాగత ఏర్పాట్లతో భారతదేశం చక్కని సంస్థాగత చట్రాన్ని ఏర్పరిచింది. పాలనాధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించటం కూడా గొప్ప విజయమనే చెప్పుకోవాలి. సైనిక దళాలపై పౌర నియంత్రణను ఏర్పరచటం మరొక ముఖ్యమైన విషయం. మన పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో పోలిస్తే ప్రజాస్వామిక సంస్థలలో భారతదేశం ఎంతో ముందుంది.

ఐక్యతను, దేశ సమగ్రతను కాపాడి, నిలపటంలో కూడా భారతదేశం విజయవంతం అయ్యింది. దేశంలోని అంతులేని వైవిధ్యత కారణంగా అది విచ్ఛిన్నం కావటానికి అనువైన దేశమని అందరూ భావించారు, అలాకాకపోవటం అన్నది ఇతర దేశాలకు చక్కని గుణపాఠంగా ఉపయోగపడుతుంది.

ఆర్థిక లక్ష్యాల విషయంలో ప్రణాళికా సంఘాన్ని నెలకొల్పటం, సమతుల ప్రాంతీయ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవటం అన్న అంశాలు చెప్పుకోదగినవి. సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వర్గాల పట్ల నిజమైన శ్రద్ధ కనబరిచారు. ఆహారం కోసం ఇతరులపై ఆధారపడిన స్థితి నుంచి కాలక్రమంలో ఆహార స్వయం సమృద్ధిని సాధించిన స్థితికి దేశం చేరుకుంది. ఇది పరిశ్రమలకు చక్కని పునాదిగా నిలచింది. అయితే ప్రాంతాల మధ్య సమాన అభివృద్ధి జరుగక కొన్ని ప్రాంతాలు ఇతర ప్రాంతాలకంటే ఎక్కువ అభివృద్ధి చెందాయి. అదేవిధంగా, ఉపాధి అవకాశాలు పెరగవలసినంతగా పెరగలేదు.

ప్రాథమిక విద్యకి, ప్రజారోగ్యానికి తక్కువ ప్రాధాన్యతను ఇవ్వటం పెద్ద లోపమని నిస్సందేహంగా పేర్కొనవచ్చు. ఇది భారతదేశాన్ని చాలాకాలం పాటు పీడిస్తూ ఉంటుంది. అదే సమయంలో నూతన శకాన్ని ఆరంభించిన చైనా, కొరియాలు భారతదేశంతో పోలిస్తే ఈ రెండు అంశాల్లో ఎంతో ప్రగతిని సాధించాయి.

కుల వ్యవస్థలోని గర్హించదగ్గ అంటరానితనం వంటి వాటిని తొలగించినప్పటికీ వివక్షత ఇంకా తీవ్రంగానే కొనసాగుతోంది. లింగ వివక్షత కూడా కొనసాగుతోంది.

### కీలక పదాలు

| | | |
|---|---|---|
| రాష్ట్రాల పునఃవ్యవస్థీకరణ | ఒక పార్టీ ఆధిపత్యం | |
| అత్యవసర పరిస్థితి | ప్రాంతీయ ఉద్యమాలు | జాతీయీకరణ |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. బ్రాకెట్టు ముందున్న వ్యాఖ్యానానికి సంబంధించి అనువైన వ్యాఖ్యానం/ వ్యాఖ్యానాలను బ్రాకెట్టు లోపల ఉన్నవాటి నుంచి గుర్తించండి.

    అ) రాజకీయ సమానత్వాన్ని దీనితో గుర్తించవచ్చు (ఏ పాఠశాలలోనైనా ప్రవేశం పొందే హక్కు, ఒక వ్యక్తి - ఒక ఓటు అన్న సూత్రం, దైవారాధన ప్రదేశంలోకి ప్రవేశించే హక్కు)

    ఆ) భారతదేశ విషయంలో అందరికీ వయోజన ఓటు హక్కు అంటే (అందరినీ ఏదో ఒక రాజకీయ పార్టీకి ఓటు వెయ్యటానికి అనుమతించటం, అందరినీ ఎన్నికలలో ఓటు వెయ్యటానికి అనుమతించటం, అందరినీ కాంగ్రెస్ పార్టీకి ఓటు వెయ్యటానికి అనుమతించటం)

    ఇ) కాంగ్రెస్ ఆధిపత్యం దీని వల్ల సాధ్యమయ్యింది (విభిన్న సిద్ధాంతాలు ఉన్న వాళ్లని ఆకర్షించగలగటం, ఎన్నికల తరువాత అత్యధిక శాసన సభా స్థానాలను గెలుచుకోగలగటం, ఎన్నికలలో పోలీసు బలగాన్ని ఉపయోగించుకోగలగటం)

    ఈ) అత్యవసర పరిస్థితి ఫలితంగా (ప్రజల హక్కులకు పరిమితులు విధింపబడ్డాయి, పేదరికం తొలగింపబడింది, అన్ని రాజకీయ పార్టీల ఆమోదం పొందింది)

2. స్వాతంత్రం వచ్చిన తొలి సంవత్సరాలలో సామాజిక-ఆర్థిక మార్పు తీసుకురావటానికి ఏ చర్యలు చేపట్టారు?

3. ఒక పార్టీ ఆధిపత్యం అంటే ఏం అర్థం చేసుకున్నారు? అది ఎన్నికలలో మాత్రమే ఆధిపత్యమా, లేక సిద్ధాంత భావజాలంలో కూడా ఆధిపత్యమా? మీ కారణాలను పేర్కొంటూ చర్చించండి.

4. ఐక్యత సాధించే అంశంగానో లేక విభజించే దానిగానో భారతదేశ రాజకీయాలలో భాష కేంద్ర బిందువుగా అనేకసార్లు తెరమీదకు వచ్చింది. ఈ ఘటనలను గుర్తించి వాటిని వివరించండి.

5. 1967 ఎన్నికల తరువాత రాజకీయ వ్యవస్థలో వచ్చిన ముఖ్యమైన మార్పులు ఏవి?

6. రాష్ట్రాలను ఏర్పరచటానికి మరొక ఆధారం ఏమైనా ఉందా? భాష ఆధారంగా పునఃవ్యవస్థీకరణ కంటే అది ఏవిధంగా మెరుగైనదిగా ఉండేది?

7. ఇందిరాగాంధీ తీసుకున్న ఏ చర్యలను 'వామపక్ష పంథా వైపు మళ్లించటం'గా పేర్కొన్నారు? అందుకు ముందు దశాబ్దాల విధానాలతో పోలిస్తే ఇవి ఏ విధంగా భిన్నమైనవి? ఆర్థిక శాస్త్ర అధ్యాయాల ఆధారంగా ప్రస్తుత విధానాలకూ, వాటికీ తేడా ఏమిటో పేర్కొనండి.

8. భారత ప్రజాస్వామ్యాన్ని అత్యవసర పరిస్థితి ఏ విధంగా వెనక్కి తీసుకుపోయింది?

9. అత్యవసర పరిస్థితి కాలంలో ఏ విధమైన వ్యవస్థాగత మార్పులు వచ్చాయి?